క్లుప్తంగా

సచివాలయాలు సేవా నిలయాలు

కలకడ : సచివాలయాలు సేవా నిలయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. బుధవారం మండలంలోని ముడియంవారిపల్లె నూతన సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ శాంతమ్మ, సింగల్‌విండో అధ్యక్షుడు వెంక్రటమణరెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి సమస్యకు గ్రామస్తులు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లి చెప్పుకోవాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు మొదలు, సంక్షేమ పథకాల లబ్ధికి దరఖాస్తు చేసే వరకూ వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి దేశంలోనే ఏపీలో సచివాలయాల ద్వారా ఉత్తమ సేవలు అందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కిషోకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చిన్ని, పంచాయతీ కార్యదర్శి శివాజి, రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలకు పీలేరు డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్న డీఎం కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం పీలేరు నుంచి తలకోనకు 20 బస్సులు, భాకరాపేట నుంచి తలకోనకు 4 బస్సులు, బోడేవాండ్లపల్లె నుంచి తలకోనకు 3 బస్సులు, బసన్నగారిపల్లె నుంచి తలకోనకు 3 బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. అలాగే శనివారం కలకడ ఝరి ఉత్సవాలకు పీలేరు నుంచి 15 ప్రత్యక సర్వీసులు నడుపనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శివరాత్రి స్పెషల్ ఆపరేషన్స్ సందర్భంగా గ్యారేజీలో బస్సులను చెక్ చేసుకుని మంచి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని తెలిపారు. అందరూ కలిసి శివరాత్రి స్పెషల్ బస్సులకు గత ఏడాది కంటే అధిక ఆదాయం తేవాలన్నారు. ఫిబ్రవరి నెలలో ఓఆర్‌లో రీజియన్‌లో మొదటి స్థానం, కెఎంపిఎల్‌లో రెండవ స్థానం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీపై ఇంటింటి ప్రచారం

బి.కొత్తకోట: నగర పంచాయతీలో ఇంటిపన్నుల బకాయిలు, ప్రస్తుత పన్నులను చెల్లిస్తే ప్రభుత్వం పూర్తిగా వడ్డీ మాఫీ చేస్తుందని అధికారులు బుధవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమిషనర్ పీఆర్.మనోహర్, మేనేజర్ రమాదేవి, ఆర్ఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది బ్యానర్‌తో వీధుల్లో ప్రచారం చేశారు. ఇళ్లవద్దకు వెళ్లి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వివరించారు. పూర్తి వడ్డీ మాఫీ అవుతుందని, డబ్బు ఆదా చేసుకోవచ్చని కమిషనర్ సూచించారు. అలాగే దర్గావీధి, సంతబజారు ప్రాంతాల్లో సమస్యలపై ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా తక్షణ మే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కస్తూర్బాలో బేటీ బచావో-బేటీ పడావో

పెద్దతిప్పసముద్రం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లను చదవనిద్దాం-ఆడ పిల్లను ఎదగనిద్దామని నినాదాలు చేశారు. అలాగే లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని సూచించారు. అనంతరం ప్రభుత్వం బాలికల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు : కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ అన్నారు. బుధవారం షీ ఎన్‌జీవో కార్యాలయంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస యోజన, సూర్యఘర్‌రూఫ్, టాప్ సోలార్, పీఎం విశ్వకర్మ యోజన పథకం గూర్చి అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారికి బ్యాంకుల్లో రుణాలు ఏ విధంగా పొందవచ్చో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్లికారాణి, సుధారాణి, సుధాకర్ రాయల్, రమణ, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ

పీలేరు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా తనిఖీ చేశారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెయిన్ స్కూల్, కావలిపల్లె తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 72 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పీలేరులో టౌన్‌లోనే 46 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సుబ్రమణ్యం, ఎస్‌బీ ఏఎస్ఐ ఉమర్‌అలి పాల్గొన్నారు.

పట్టణ పేదల సొంతింటి కల సాకారం

- నేడు మదనపల్లె మున్సిపాలిటీలో 1,872 టిడ్కో ఇళ్ల పంపిణీ
- ఒక రూపాయికే లబ్ధిదారులకు రూ.7.20లక్షల విలువ చేసే ఇల్లు
- 36 ఎకరాల్లో రూ.129.12 కోట్లతో 39 బ్లాకుల్లో మినీటౌన్‌షిప్



పంపిణీకి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇళ్లు

మదనపల్లె : పట్టణ పేదలకూ సొంతింటి కలను సాకారం చేయాలన్న రాష్ట్రప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది. నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా, ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో)-పి.యం.ఎ.వై.(యు) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ జగనన్న నగర్‌లో నిర్మించిన 1,872 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. గత టీడీపీ ప్రభుత్వం నిరుపేదలపై మోపిన అధిక ధరలను పక్కనపెట్టి, సీఎం వైఎస్.జగన్ ప్రభుత్వం అన్ని వసతులతో జీ+3 విధానంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కేవలం ఒక రూపాయికే రూ.7.20 లక్షల విలువచేసే ప్లాట్లను ఉచితంగా అందిస్తోంది. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన జరగనున్న టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిసార్‌అహ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేయనున్నారు.

టీడీపీ మోసం చేస్తే.. జగన్ న్యాయం చేస్తున్నారు

టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్‌టీఆర్ అర్బన్ గృహ నిర్మాణం పథకం కింద... షేర్‌వాల్ టెక్నాలజీ ద్వారా అన్ని వసతులతో 300, 365, 430 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ స్కీంలో కేంద్రప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు సబ్సిడీ ఇస్తాయి. 300 చదరపు అడుగులు ఇంటికి రూ.6.03లక్షలు ప్రాజెక్ట్ ధరగా నిర్ణయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రూ.3లక్షలు పోనూ మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడు, అసలు, వడ్డీ కలిపి బ్యాంకుకు కంతుల రూపేణ చెల్లించాలి. 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుని వాటా కింద రూ.50వేలు, లక్ష రూపాయలు నాలుగువిడతల్లో చెల్లించాలని నిర్ణయించారు. ఇది నిజమని నమ్మి చాలామంది దరఖాస్తులు చేసుకుని, తమకు ఇల్లు వస్తుందని ఆశగా ఎదురుచూడసాగారు. అయితే ఎప్పటిలాగానే....టీడీపీ ప్రభుత్వం స్థలసేకరణ పేరుతో కొన్నాళ్లు కాలయాపన చేసి, ప్రాజెక్ట్ ప్రారంభించి మూడుఏళ్లు అయినా ఒక్క ఇల్లు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం చేయలేక చేతులెత్తేశారు. టిడ్కో ఇళ్ల పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు. ఈ క్రమంలో...ప్రస్తుత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడి హోదాలో నిర్వహించిన ప్రజాసంకల్పపాదయాత్రలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు చంద్రబాబు చేసిన మోసంపై వివరిస్తే... వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే...300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లు ఒక రూపాయికే ఇస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

మదనపల్లె టిడ్కో ప్రాజెక్ట్ వివరాలు...	
స్థల విస్తీర్ణం	35.81 ఎకరాలు.
బ్లాకుల సంఖ్య	39
లబ్ధిదారులు	1,872 ఇళ్లు (300 చదరపు అడుగులు)
ప్రాజెక్ట్ విలువ హౌసింగ్	రూ.106.13 కోట్లు
ఇన్‌ఫ్రా మొత్తం	రూ. 17.20 కోట్లు
ఎస్‌టీపీ	రూ. 3.91 కోట్లు
ఎలక్ట్రిఫికేషన్	రూ. 1.88 కోట్లు

అన్ని వసతులతో ఆధునిక పట్టణ ఇళ్లు :

జీ+3 విధానంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు తాగునీరు, డ్రైనేజీ, ఎస్టీపీ, విద్యుత్ సదుపాయం, రోడ్లు వంటి అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ఆ తర్వాతనే లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం మదనపల్లె పట్టణానికి సమీపంలో, ఎర్రగానిమిట్ట వద్ద అనువైన ప్రాంతంలో నిర్మించిన ఈ అపార్ట్‌మెంట్లు మినీ టౌన్‌షిప్‌ను తలపిస్తున్నాయి. దీనికి వైఎస్సార్ జగనన్న నగర్‌గా నామకరణం చేసి, అంతర్గత నిర్వహణకు నివాసితులతో సంక్షేమసంఘాలను సైతం ఏర్పాటుచేయనున్నారు. అలాగే టిడ్కో నివాసాల వద్ద మెప్మా ఆధ్వర్యంలో పట్టణ మహిళాసంఘాలు విజయవంతంగా నిర్వహిస్తున్న జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేయనున్నారు. స్థానికుల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాళ్లను సైతం నిర్మిస్తారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నకే సాధ్యం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల చెంతకే తెచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని పాత ములకలచెరువు, బురకాయలకోట పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. పాత ములకలచెరువులో పురాతన కాలం నాటి మల్లికార్జున స్వామి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు రూ.2 కోట్లు నిధులను మంజూరు చేయించడంపై ప్రజలంతా ఎమ్మెల్యేను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు. జగనన్న సహకారంతోనే తాను పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను వింటూ వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు వై.విజయమ్మ, మంజుల, ఎంపీటీసీలు లక్ష్మిదేవి, రేష్మా, ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, నాయకులు రవిశేఖర్‌రెడ్డి, దిన్నెపాటి రవీంద్రారెడ్డి, సిద్దారెడ్డి, రామనాథం, ఫక్రుద్దీన్, రఫి, మంజునాథ్, విజయ్‌కుమార్‌రాజు, సోమశేఖర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మండలంలోని దుగసానివారిపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు వేశారు. రఘునాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహమ్మద్, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాషా, రామచంద్ర, వెంకటేష్ తదితరులు పార్టీలో చేరారు.

కరువు రైతులకు రూ.10 కోట్ల పరిహారం

బి.కొత్తకోట: గత ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారంగా రూ.10.99 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా వైఎస్.జగన్ ప్రభుత్వం పంట నష్టాలపై రైతులను ఆదుకోవడంలో ముందున్నారని అన్నారు. గత ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభకాక మునుపే పరిహారం మంజూరు చేసి ఆదుకున్నార న్నారు. ఈ పరిహారం ఖరీఫ్‌లో పంటల సాగుకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని చెప్పారు. కురబలకోట మండలంలో 517 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లగా 1,316 మంది రైతులకు రూ.87 లక్షలు, పెద్దతిప్పసముద్రంలో 3,195 హెక్టార్లలో పంటలకు నష్టం జరగ్గా 5,075 మంది రైతులకు రూ.4.98 కోట్లు, పెద్దమండ్యం మండలంలో 563 హెక్టార్లలో జరిగిన పంట నష్టానికి 982 మంది రైతులకు రూ.95 లక్షలు పరిహారం మంజూరు అయిందన్నారు. బి.కొత్తకోట మండలంలో 860 హెక్టార్లలో పంట నష్టానికి సంబంధించి 2,010 మంది రైతులకు 1.41 కోట్లు, తంబళ్లపల్లె మండలంలో 1,639 హెక్టార్లలో పంట నష్టానికి 2,904 మంది రైతులకు రూ.2.78 కోట్ల పరిహారం మంజూరైనట్లు చెప్పారు.

పేదలందరికీ శాశ్వత నివాసాలు

- దేశచరిత్రలోనే పెద్ద మొత్తంలో పేదలకు ఇళ్లు
- మండలంలో 3,050 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- అక్కచెల్లెమ్మలకు ఆస్తి మీద పూర్తిహక్కు



ఇంటిపట్టా పంపిణీ చేస్తున్న నిసార్‌అహ్మద్, ఎంపీపీ రెడ్డెమ్మ, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి శాశ్వత నివాసం దక్కిందని, దేశచరిత్రలోనే పెద్ద మొత్తంలో పేదలకు ఇళ్లు పంపిణీ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని జేసీఎం ఫంక్షన్ హాల్‌లో నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా మండలంలోని లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలతో కూడిన పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ....జగనన్న 58 నెలల పాలనలో ప్రతి అడుగు పేదలు, బడుగు, బలహీనవర్గాల మంచికోసమే పనిచేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన నవరత్నాల పథకాల్లో 9 9శాతం హామీలను పూర్తిచేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, మరే ముఖ్యమంత్రి ఈ విధంగా ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్న దాఖలాలు లేవన్నారు. దేశచరిత్రలోనే 31లక్షల మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడమే కాకుండా, చరిత్రలోనే తొలిసారిగా పేదలకు ఇంటిస్థలాల కన్వేయన్స్ డీడ్స్ చేస్తూ, లబ్ధిదారులకే సర్వహక్కులు కల్పించారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పేదవాడికి ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇలాంటి ప్రతిపక్షాలకు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రజలజీవితాల్లో వెలుగులు తేవడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, ఎంఎస్ఎం ఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, వైస్ ఎంపీపీలు డిష్‌రమణ, నందినితాజ్, మండల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం

మదనపల్లె : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో... పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 8,9వవార్డు పరిధిలో ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్‌కార్డుల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... పేదల ఆరోగ్యమే జగనన్న ప్రభుత్వ ధ్యేయంగా వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి, వేలకోట్లు ఖర్చుచేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో రూ.25లక్షల ఖరీదైన వైద్యం పూర్తి ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్‌చంద్రశేఖర్, మేస్త్రీశ్రీనివాసులు, ప్రసాద్‌బాబు, ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, పసుపురవి, ఎల్ఐసీ.సుధాకర్, ఆంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ బావాజీ, జిల్లా క్రిస్టియన్ విభాగం చైర్మన్ బోనాసిజాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేవీకే సేవలు మరింత విస్తృతం చేయాలి

కలికిరి: వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు, నూతన పంట రకాలు, తెగుళ్ళ నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేసి వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుందరావు అన్నారు. కలికిరి కేవీకేను సందర్శించిన ఆయన కేవీకే డెమో యూనిట్‌లు వానపాముల ఎరువు, కోళ్ళు, పొట్టేళ్ళ పెంపకం, షేడ్‌నెట్‌లో మామిడి అంటు మొక్కలను పరిశీలించారు. వచ్చే ఏడాదికి సంబంధించి కేవీకే ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిశోధన సంచాలకులు మురళీక్రిష్ణ, కేవీకే సమన్వయకర్త జీఎస్ పాండురంగ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

మదనపల్లె: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబాషు తెలిపారు. పట్టణంలోని బాకావాని తోటకు చెందిన లద్దిగం భాస్కర్ బాబు (53), అక్రమంగా ప్రభుత్వ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి రూ. 1540 విలువ చేసే 13 క్వార్టర్ బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మండలంలోని చీకలబైలు సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి కు చెందిన వెంకటరమణ (56), బస్సులో 15 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

మదనపల్లె : మదనపల్లె కోర్టులో ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఎస్.శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు, ప్రమాదపు, సివిల్ కేసులు, ఇతర కేసులను లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని జడ్జి తెలిపారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోండి



మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

వాల్మీకిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని గండబోయనపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో ఎముకలు, కీళ్ళు, నరాల నిపుణులు, కంటి వైద్యులు, జనరల్ సర్జన్‌లు, స్త్రీల వైద్య నిపుణులు వంటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం రోగులతో మాట్లాడి, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వసీం, అవినాష్, శశిభూషన్‌రెడ్డి, సిహెచ్‌వో ఇందిర, సూపర్‌వైజర్లు సుధాకర్, భానుబి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తత

పెద్దతిప్పసముద్రం: కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో పని చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మండలంలోని పలు చెక్‌పోస్టులను తనిఖీ చేసారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రధానంగా కర్ణాటక మద్యం, నగదు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ రవీంద్రబాబు ఉన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కురబలకోట: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో మండలంలోని బండపల్లెకు చెందిన జన సేన నాయకులు బండపల్లె శ్రీనివాసులురెడ్డి, బండపల్లె సంతోష్ రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ రెడ్డెప్ప మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజక వర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి, వైఎస్ జగన్ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడతామని వారు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి బ్రహోత్సవాలో భాగంగా బుధవారం స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, స్వస్తి వాచన, కలశస్థాపన, నాందీ, ఋత్విగ్వరణం, మండల పూజ నిర్వహించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ, బాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు చేస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ముస్తాబైన శివాలయాలు

శివరాత్రికి మదనపల్లె, మదనపల్లె మండల పరిధిలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయం, టీ.ఎస్.క్రిష్టారెడ్డివీధిలోని పంచాలింగాల శివాలయం, శివనగర్‌లోని శిద్దలింగేశ్వరస్వామి ఆలయం, చౌడేశ్వరినగర్‌లోని నీలకంఠేశ్వర ఆలయం,బసినికొండలోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబు చేశారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చీకటిపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనం, రంగనాథపురంలో వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే చింతల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉండేదని, ఇప్పుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలోనూ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయడంతో ప్రజల ముంగిటనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని అనుసరించేలా పాలనసాగిస్తున్న సీఎంను వచ్చే ఎన్నికలలో గెలిపించాలని కోరారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి, ప్రతి కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే, ప్రభుత్వ పథకాలు అందిఉంటేనే తనకు ఓటు వేసి గెలిపించాలని అడిగే ధైర్యం ఉన్న వ్యక్తి జగన్ మోహన్ రెడ్డిఅని, అటువంటిని మరోసారి సీఎంగా గెలిపించుకుంటే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ జీవీ శ్రీనాథ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, సర్పంచ్‌లు డా.సురేంద్రనాథరెడ్డి, వెంకటరెడ్డి, గంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రమణప్రతీప్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న చింతల సాయిక్రిష్టారెడ్డి

వాల్మీకిపురం: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజాప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం అందించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్టారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని గంగమ్మగుడివీధి, ఇరాని కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి, వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని, ఎంపీగా మిథున్ రెడ్డిని, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, ఆనంద, ఇబ్రహీం, రఘు, సైఫుల్లా, చికెన్‌మస్తాన్, రవి, షాహెద్, సాధిక్, గణేష్, నరసింహులు, రాయుడు, సుధాకర, ఖాదరి, బబ్లూ, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలి

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని చింతల సాయిక్రిష్టారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇరాని కాలనీకి చెందిన అమీర్, నౌషాద్, హైదర్, ముక్తియార్, సమీర్, సబ్దర్, నూరీభాను, అబిదాఖానం, షారాభాను, జుబేదా, నూర్‌జాన్‌లు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్టారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి చింతల సాయిక్రిష్టారెడ్డి వైఎస్సార్‌సిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్ వితరణ



శానిటరీ వెండింగ్ మిషన్ అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి అమ్మాయిల సౌకర్యార్థం రోటరీ ఇంటర్‌నేషన్ సంస్థ శానిటరీ వెండింగ్ మిషన్, ఇన్సినేటర్‌లను ఉచితంగా అందజేశారు. బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ క్రిష్ణవేణి మాట్లాడుతూ ఇటీవల ఇటలీకి చెందిన ల్యూకోస్ కాలేజీని సందర్శించినట్లు తెలిపారు. కాలేజీలో చదువుతున్న అమ్మాయిలు అత్యవసర నెలసరి సమయంలో ఇబ్బందులు పడకుండా శానిటరీ వెండింగ్ మిషన్ అందజేయాలని కోరామన్నారు. రోటరీ ఇంటరాక్ట్ ఇంటర్‌నేషన్ సంస్థ ఆధ్వర్యంలో రెండు పరికరాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ దేవతా శంకర్, నవీన్, చైతన్య, పృధ్వీ, అధ్యాపకులు మోహన్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

పీలేరు : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెయిన్ ఉన్నత పాఠశాల ప్రతిభావంతులకు నిలయంగా ఉందని అన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నట్లు తెలిపారు.